క్లుప్తంగా

చండూరులో మెడికల్ క్యాంపు



మానవపాడు: మండలంలోని చండూరులో ఆదివారం స్వర్గీయ సురవరం ప్రతాప్‌రెడ్డి కుమారుడు డాక్టర్ సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, మనవడు డాక్టర్ సుధీర్‌రెడ్డి, డాక్టర్ హ్రితిక ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహులు, సురవరం భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, నరసింహబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



అయిజ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌ఎన్ భారతి మాట్లాడుతూ కిట్లలో జింక్, విటమిన్స్, నెయ్యి, కర్జూరం, హార్లిక్స్ ఉంటాయని తెలిపారు. గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

శివ మాలధారుల ప్రత్యేక పూజలు



ధరూరు: శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక మాలాధారణ గావించిన శివ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో 10 రోజులుగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలోనే భిక్ష చేశారు. కార్యక్రమంలో గురు స్వాములు బోయ మల్లి, దర్శెల్లి, శివ స్వాములు సీతారాములు, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో సోమవారం 20 మందికి పైగా శివస్వాములకు గొల్ల చిన్న మద్దిలేటి భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివస్వాములు కృష్ణ, రవికుమార్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వావిలాలలో శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం అభిషేకం, రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా సోమవారం పల్లకీసేవ కన్నుల పండువగా జరుపుకున్నారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బ్యాండు ప్రదర్శన, పాలపండ్ల బండలాగుడు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు.

పంట సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ఎర్రవల్లిచౌరస్తా: రైతులు యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంటలో అధిక దిగుబడి సాధించేందుకు ప్రత్యేక సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ భరత్ సింహా సూచించారు. సోమవారం ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగలో ఆకు చుట్టు పురుగు ఉధృతి అధికంగా ఉందన్నారు. రెక్కల పురుగు నివారణకు ఎకరానికి నాలుగు చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా పురుగు ఉధృతి అధికంగా ఉంటే క్వినాల్‌ఫాస్ అనే మందును ఎకరానికి 400 ఎం.ఎల్ చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు ఉన్నారు.

సంబరంగా సంక్రాంతి

- ఆకట్టుకున్న రంగవల్లులు
- పల్లెల్లో హరిదాసుల సందడి



ఉండవెల్లి ప్రాగటూరులో..



మానవపాడు చెన్నిపాడులో..

అలంపూర్: నియోజకవర్గ వ్యాప్తంగా మూడు రోజులపాటు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి ప్రత్యేకతను చాటుతూ యువకులు భోగి మంటలు, గాలి పటాలను ఎగరవేశారు. మహిళలు ఇంటి ముందు కల్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులను వేసి సంక్రాంతి ప్రత్యేకతను చాటి చెప్పారు. పాడి పంటలు బాగా పండాలని లక్ష్మీదేవిని ఆహ్వానిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామీణ సాంప్రదాయం ఉట్టి పడే విధంగా గ్రామీణ క్రీడలు, ముగ్గుల పోటీలు, బంధు-మిత్రులతో కలిసి సహపంక్తి భోజనాలతో గ్రామాలు సందడిగా కనిపించాయి. రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో గ్రామ ముంగిళ్లు..రక రకాల పతంగులతో ఆకాశం శోభాయమానంగా మారాయి. పట్టణంలోని దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్రంలో వెలిసిన బ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారిని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
అయిజ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో భోగి, మకర సంక్రాంతి, కనుమను సంప్రదాయపరంగా జరుపుకున్నారు. సోమవారం కనుమ పండుగ సందర్భంగా పిండివంటలు చేసుకొని బంధువులు, మిత్రులతో సంతోషంగా గడిపారు. హరిదాసులు ఇంటింటికి తిరిగి ధాన్యం సేకరించారు. గంగిరెద్దుతో విన్యాసాలు ఆకట్టుకున్నారు.
మానవపాడు: మండల వ్యాప్తంగా ప్రజలు సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాల్లో క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇంటి ముంగిట రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో మూడు రోజులపాటు సంక్రాంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ వేడుకలను నిర్వహించారు. తనగలలో చల్లా యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.
ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండగ సంబరాలతో అంబరాన్నంటాయి. ఆదివారం మహిళలు ముగ్గులను వేస్తు సందడి చేశారు. ప్రాగటూరులో ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.
ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రైతులు పండించిన సిరిధాన్యాలను, రేగిపళ్లను గొబ్బెమ్మలలో పోసి ముగ్గుల్లో ఉంచారు. హరిదాసులు, గంగిరెద్దులు ఇంటింటికి తిరుగుతూ కీర్తనలను పాడారు. చిన్నారులు కేరింతలలో గాలిపటాలను ఎగురవేశారు. కొత్త అల్లుల్లు, కోడల్లు ఇండ్లకు రావడంతో ప్రతి ఇల్లు కూడా చుట్టాలతో సందడిగా మారింది. పాడిపశువులను భక్తిశ్రద్ధలతో పూజించారు.



అలంపూర్ చౌరస్తాలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు



శాంతినగర్‌లోని రామచంద్రానగర్ కాలనీలో..

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



రాజోళి మాన్‌దొడ్డి మాధవస్వామి రథోత్సవంలో



అయిజలో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రాజోళి: ఈ నెల 14 వతేదీ నుంచి మండలంలోని మాన్‌దొడ్డిలో మాధవ స్వామి జాతర ఉత్సవాలు భక్తశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ముందుగా స్వామివారిని రథంపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జాతర సందర్భంగా కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మాన్‌దొడ్డి ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన జట్టుకు ఎంపీపీ మరియమ్మ రూ.20వేల నగదు, రెండో బహుమతి ననసూర్ సర్పంచ్ ఎల్లమ్మ రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు చిన్న ధన్వాడ సర్పంచ్ పద్మ రూ.10 వేలు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సవారి, ఎంపీటీసీ మన్సూర్, యంగ్ ఇండియా సభ్యులు ఖలీల్ తదిదరులు పాల్గొన్నారు.
అయిజ: మండలంలోని ఉత్తనూరులో గోపాలదాసులవారి ఉత్సవాలు మూడు రోజులపాటు కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా సోమవారం గోపాలదాసుల వారికి వేదమంత్రాలు పఠిస్తూ పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాగణం మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

క్రీడలతో మానసికోల్లాసం



కేటీదొడ్డిలో బహుమతుల ప్రదానం



ఉండవెల్లి కంచుపాడులో ..

ఉండవెల్లి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు సురవరం కపిల్ అన్నారు. మండలంలోని కంచుపాడులోని సురవరం వెంకట్రామిరెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన వార్షిక యువజనోత్సవంలో భాగంగా ఆదివారం కబడ్డీ, షటిల్, వాలీబాల్, సోమవారం ముగ్గుల పోటీలు, గోనెసంచులతో గెంతులాట, తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ నెల విజేతలకు 20న కలెక్టర్ బహుమతులు అందజేస్తారని కపిల్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరాంజనేయులు, శివ బ్రహ్మ, బాబు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.
గట్టు: మండలంలోని తప్పెట్లమొర్సులో ఓపెన్ టూ ఆల్ కబడ్డీ పోటీలను ఆదివారం ఉప సర్పంచు దేవమ్మ, యూత్ అధ్యక్షుడు తిమ్మప్ప, జై నడిగడ్డ యువత జిల్లా సమన్వయకర్త రంగస్వామిగౌడ్, మోహన్‌గౌడ్, గోవర్ధన్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో జై నడిగడ్డ యువత శేఖర్‌గౌడ్, చంద్రశేఖర్, హనుమంతు, శేషంపల్లిబత్తలయ్య, ఆటో పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.
కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడులో ఆదివారం కోలంట్లు, ఎద్దుల బండ్ల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు మాధవి, వార్డు సభ్యులు, సింగిల్ విండో డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతాయని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, సత్యమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ధరూరు: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం మండలంలోని మాల్‌దొడ్డి, చింతరేవుల, అల్వాలపాడు, కోతులగిద్ద, మార్లబీడు గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని కాళికాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు కిష్టాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నలుగురుపై దాడి.. కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లురులో స్థలం వివాదంలో కర్రలతో నలుగురిపై దాడి చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం గత నెలలో గ్రామంలోని సలీం వద్ద పూజారులు శ్రీకాంత్, శ్రీధర్‌లు మూడు సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలం మాదేనని చాంద్‌బాషా కుటుంబసభ్యులు కొనుగోలుదారులతో గొడవకు దిగారు. ఇద్దరి మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో ఆవేశంలో చాంద్ భాషా, ముర్తాజ్ వల్లి, ఇలియాజ్, మహిళ కలిసి పూజారులు శ్రీకాంత్, శ్రీధర్‌లపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పశుగ్రాసం దగ్ధం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో పశుగ్రాసం దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన గోవులకు పశుపోషణ కోసం భక్తులు ప్రతి సంవత్సరం వరిగడ్డిని ఉచితంగా ఇస్తారు. ఆవుల మేత కోసం నిల్వచేసిన వరిగడ్డి వాముకు ప్రమాదవశాత్తు ఆదివారం నిప్పు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది. ఆలయ నిర్వాహకులు గోమాత రక్షణ కోసం ఎటువంటి శ్రద్ధ తీసుకోవడం లేదని పలువురు ఆరోపించారు.

ఎంపీకి ఘన స్వాగతం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు సోమవారం బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయ దర్శనానికి వెళ్తున్న ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎర్రవల్లి చౌరస్తాలో పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జగదీష్, నాయకులు సంపత్, వెంకటస్వామి, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

లారెక్కిన రైలింజన్

ఉండవెల్లి: సాధారణంగా రైలు పట్టాలపై పరుగులు పెట్టాల్సిన రైలింజన్ రోడ్డు మార్గం ద్వారా లారీపై వెళ్తుండగా స్థానికులు అవాక్కాయ్యారు. ఇది నిజమేనా అనట్టుగా ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఆదివారం జాతీయ రహదారిపై బెంగుళూరు నుంచి హైదరాబాద్ వైపు లారీ ట్రక్కుపై రైళ్ల ఇంజన్లను తీసుకెళ్తుండగా పుల్లూరు శివారులోని టోల్‌గేట్ వద్ద రాగానే వాహనదారులు, స్థానికులు మొబైల్‌లో ఆసక్తిగా చిత్రీకరించారు. దాదాపు 122 టన్నులకు పైగా బరువు ఉంటుందని, ట్రక్కుకు 64 టైర్లు ఉన్నాయని పలువురు పేర్కొన్నారు.



పేదల ఆరోగ్యానికి పెద్దపీట



అలంపూర్ చౌరస్తాలో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. సోమవారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను నియోజకవర్గంలోని 62 మంది లబ్ధిదారులకు రూ.26,66000ల విలువ చేసే చెక్కులను ఆయన అందజేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతో ఆసరాగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

రాజోళి: మండలంలోని నూతన గ్రామ పంచాయతీ పడమటి గార్లపాడులో నూతన రేషన్ దుకాణాన్ని ఆదివారం ఎమ్మెల్యే అబ్రహం ప్రారంభించారు. గతంలో లబ్ధిదారులు మూడు కిలోమీటర్లు కాలినడకన రాజోళికి వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకునేవారని ఇక గ్రామస్తులు కష్టాలు తొలగిపోయాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకులు అజయ్, సర్పంచ్ భూషణం, ఉప సర్పంచ్ దానియేల్, గంగిరెడ్డి మూగెన్న, కాళపోగు రాజు తదిదరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో బీఆర్‌ఎస్ కార్యకర్త వెంకటేశ్వర్లు ఇటీవల మృతిచెందాడు. కార్యకర్తకు పార్టీ సభ్యత్వం ఉండటంతో రూ.2 లక్షల ఇన్సూరెన్స్ మంజూరయ్యింది. దీంతో సోమవారం ఎమ్మెల్యే అబ్రహం బాధితుడి భార్యకు రూ.2లక్షల విలువ చేసే చెక్కును అందజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను కలిసి యోగక్షేమాలని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీసమ్మ, వైస్ ఎంపీపీదేవన్న, ఎంపీటీసీలు కురుమూర్తి, నాయకులు రమణ, వెంకటేశ్వర్లు గౌడ్, కృష్ణ గౌడ్, రఘు రెడ్డి, సుధాకర్ రెడ్డి, జయ్యన్న, దేవదాసు, శివసేన నాయకులు శంకర్ నాయుడు, శ్రీకాంత్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు: రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. వీరాంజనేయస్వామి జాతర, సంక్రాంతి పండుగల సందర్భంగా మండలంలోని ఆరగిద్దలో సోమవారం రాష్ట్ర స్థాయి రైతు సంబరాలను ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం క్రికెట్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచు యోగేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, ఎంపీటీసీ లక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులు అంగడి బస్వరాజు పాల్గొన్నారు.
గద్వాల: వారం రోజులుగా జరుగుతున్న బీకేఎంఆర్ ప్రీమియర్ లీగ్-3 క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టోర్నీ విజేతగా నిలిచిన శ్రీసౌమ్య ఇన్‌ఫ్రా, రన్నర్‌గా నిలిచిన విజయ్‌మెస్ నాగిరెడ్డి, మూడోస్థానంలో నిలిచిన హిమాలయ జట్లకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలను ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, దౌలు, శ్రీనివాసులు, నరహరిగౌడ్, క్రికెట్ కోచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను విజయవంతం చేయాలి



గద్వాలలోని సంగాలలో ఏర్పాట్ల పరిశీలన



మల్దకల్‌లోని నీలిపల్లిలో..

గద్వాల అర్బన్: మండలంలోని సంగాల రైతు వేదికలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సోమవారం ఎంపీడీవో రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ప్రభుత్వం కంటి వెలుగు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచు కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రోజా రాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
మల్దకల్: ప్రభుత్వ పకడ్బందీగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణయ్య కోరారు. సోమవారం మండలంలోని నీలిపల్లి, మల్దకల్ గ్రామాల్లోని పాఠశాల, రైతువేదికలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు ప్రకాష్, యాకోబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తపస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



గద్వాలలో తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



అయిజలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బొమ్మల రామకృష్ణ

గద్వాల: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆవిష్కరించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతు రావు, జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ సభ్యులు అయ్యస్వామి, రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జై నడిగడ్డ యువత సంఘం..

అయిజ: పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం జై నడిగడ్డ యువత సంఘం క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్ బొమ్మల రామకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, అజయ్, శ్రీధర్, పవన్‌కుమార్, వీరేష్, సత్యం, రంగస్వామిగౌడ్, నరసింహులు గౌడ్, వీరేష్‌గౌడ్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.